రైతులకిచ్చిన హామీలు ఏమయ్యాయి బాబూ?



ధర్నా చౌక్ నుంచి కలెక్టరేట్‌కు ర్యాలీగా వస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మేయర్ బీవై రామయ్య, నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు, మాజీ ఎమ్మెల్యేలు



ర్యాలీలో ఎడ్లబండిపై వస్తున్న మేయర్ బీవై రామయ్య, నాయకులు

- రైతు సమస్యలపై వైఎస్సార్‌సీపీ పోరు బాట విజయవంతం
- భారీగా తరలివచ్చిన రైతులు, మహిళలు, ప్రజలు
- ఎద్దుల బండి తోలుతూ ప్రత్యేక ఆకర్షణగా నగర మేయర్ బీవై రామయ్య
- నగరంలోని ధర్నా చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ

కర్నూలు (టౌన్): ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలు ఎమయ్యాయని వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతులు సీఎం చంద్రబాబును ప్రశ్నించారు. రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ కర్నూలు నగరంలో శుక్రవారం రైతులు, మహిళలు, ప్రజలు రోడ్డెక్కారు. సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. నగరంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ' కార్యక్రమానికి శుక్రవారం మంచి స్పందన వచ్చింది. భారీగా రైతులు, మహిళలు, ప్రజలు స్వచ్ఛందంగా తరలి వచ్చారు. ఉదయం నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపించింది. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి పెద్దఎత్తున రైతులు, ప్రజలు తరలివచ్చారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. నగరంలోని గౌరీగోపాల్ ఆసుపత్రి ఎదురుగా ఉన్న ధర్నా చౌక్ వద్దకు చేరుకున్న రైతులు, పార్టీ శ్రేణులు సూపర్ సిక్స్ పేరుతో కూటమి ప్రభుత్వం ప్రకటించిన హామీలను వెంటనే నెరవేర్చాలని ప్లకార్డులు ప్రదర్శించారు. జిల్లాలో తీవ్రంగా నష్టపోయిన టమాట, మిరప, వరి, పత్తి మొక్కలను ర్యాలీలో ప్రదర్శించారు. రైతు కండువాలు కప్పుకున్న పార్టీ శ్రేణులు, చిరంజీవి అభిమానుల సంఘం నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. ధర్నా చౌక్ నుంచి కర్నూలు వైద్య కళాశాల, బుధవార పేట, ప్రభుత్వ ఆసుపత్రి, కలెక్టరేట్ వరకు పెద్ద సంఖ్యలో కాలినడకన తరలివచ్చారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. రైతుల వ్యతిరేకి చంద్రబాబు డౌన్ డౌన్, మోసాలతో రాష్ట్రాన్ని ఏలే అర్హత చంద్రబాబుకు లేదంటూ ర్యాలీలో నినాదాలు చేశారు.

ఎడ్ల బండిపై మేయర్, సుభాష్

రైతు సమస్యలపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా శుక్రవారం చేపట్టిన నిరసన ర్యాలీలో కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. స్థానిక ధర్నా చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించిన ర్యాలీలో ఎడ్లబండి తోలుతూ పాల్గొన్నారు. మేయర్, అలాగే నాగలితో సుభాష్ చంద్రబోస్ ప్రదర్శన ప్రజలను ఆకట్టుకుంది.

'అన్నదాత సుఖీభవ' అమలుచేసే వరకు పోరాటం

ఎన్నికల ముందు అన్నదాత సుఖీభవ పేరుతో ప్రతి రైతును ఆదుకుంటామని ప్రకటించిన చంద్రబాబు ఈ పథకం అమలుచేసే వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని పార్టీ నేతలు ప్రకటించారు. ఇచ్చిన మాట ప్రకారం అర్హత ఉన్న ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేలు చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో పెద్ద సంఖ్యలో తరలివచ్చిన రైతులను చూసైనా ప్రభుత్వం వెంటనే పథకాన్ని అమలు చేయాలన్నారు. జిల్లాలో పత్తి రైతులు, టమాటా, మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. మోసం చేసి అధికారంలోకి వచ్చిన చంద్రబాబుకు వ్యతిరేకంగా అడుగడుగునా ప్రజల పక్షాన నిలిచి పోరాటం చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వంపై ఆరునెలలకే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని చెప్పారు. సూపర్ సిక్స్ హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేదని విమర్శించారు. ఉచిత బస్సు, ఆడబిడ్డ నిధి, నిరుద్యోగులకు భృతి ఇంకెప్పుడు ఇస్తారని నేతలు ప్రశ్నించారు. పార్టీ నాయకులు షరీఫ్, ఆదిమోహన్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, ధనుంజయ ఆచారి, విక్రమ సింహారెడ్డి, జుబేర్, యూనుస్ బాషా, కృష్ణకాంతరెడ్డి, శ్రీనివాసరావు, నాగలక్ష్మిరెడ్డి, వి.అరుణ, లక్ష్మీకాంత రెడ్డి, సుదర్శన్ రెడ్డి, మునెమ్మ, బెల్లం మహేశ్వర రెడ్డి, రెడ్డి పోగు ప్రశాంత్ కిషన్, రైల్వే ప్రసాద్, నాగవేణిరెడ్డి, రాజేష్, గద్ద రాజశేఖర్, చిరంజీవి అభిమానుల సంఘం నాయకులు శివయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ర్యాలీలోని కీలకాంశాలు

- భుజంపై చెర్నకోలతో ర్యాలీలో పాల్గొన్న పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ సోషల్ మీడియా వ్యక్తులను వేధిస్తే చర్నకోలకు పనిపెడతా అనడంతో పార్టీ శ్రేణులు చప్పట్లతో హోరెత్తించారు.
- ర్యాలీలో వైఎస్సార్‌సీపీ జెండాలు రెపరెపలాడాయి.
- ఉదయం 11 గంటలకే గౌరీగోపాల్ సర్కిల్ మొత్తం రైతులు, మహిళలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో నిండిపోయింది. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా పోలీసులు మళ్లించారు.
- కార్యకర్తలు అంబులెన్స్‌కు దారి వదిలి ముందుకు పంపించారు.
- నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు, పార్టీ నేతలు రైతు కండువాలు ధరించి ఆకర్షణగా కనిపించారు.
- అమరావతి పాలన తప్పా.. ఇతర ప్రాంతాల అభివృద్ధి పట్టదా అని బుట్టా రేణుక ప్రశ్నించడంతో పార్టీ శ్రేణులు చప్పట్లు కొడుతూ హర్షధ్వానాలు చేశారు.

క్లుప్తంగా

నేడు దత్త జయంతి

కర్నూలు కల్చరల్: నగరంలోని సాయిబాబా దేవాలయాలు, దత్తాత్రేయ స్వామి ఆలయాల్లో శనివారం దత్త జయంతి వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచి స్వామివారికి అభిషేక అర్చనలు, అంఖండ సాయినామ భజన, హోమాలు, పల్లకీసేవ, దర్శనం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు పుస్తక పరిచయ సభ

కర్నూలు కల్చరల్: భావనా ప్రియ సాహితీ వేదిక ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 5 గంటలకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో పుస్తకాల పరిచయ సభను ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రచయితలు గనుమాల మునుస్వామి రచించిన స్వామి సంకీర్తనం (కీర్తనలు) పుస్తకాన్ని కె.వి.సుబ్బలక్ష్మమ్మ, రాణి లీలావతి రచించిన మనోజ్ఞ వీచిక (నానీలు) పుస్తకాన్ని డాక్టర్ కర్నాటి చంద్రమౌళి, డాక్టర్ అనుగోలు సంజీవరాయుడు రచించిన తెలుగు ఘనత (పద్యం) పుస్తకాన్ని ఆవుల చక్రపాణి యాదవ్, రేవుల శ్రీనివాసులు రచించిన అందాల రాక్షసి (కంద పద్యాలు) పుస్తకాన్ని బైరోజు రాజశేఖర్, పుట్టా పునుగొండయ్య రచించిన సీమ చరిత శతకం (పద్యం) పుస్తకాన్ని రాణిలీలావతి, గనుమాల మునుస్వామి రచించిన శ్రీహరి సంకీర్తనా తోరణం (కీర్తనలు) పుస్తకాన్ని డాక్టర్ దండెబోయిన పార్వతీ దేవి సమీక్షిస్తారని పేర్కొన్నారు. సాహితీప్రియులు అందరూ పాల్గొనవచ్చని విజ్ఞప్తి చేశారు.

18న హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు(టౌన్): స్థానిక బి.క్యాంపు క్రీడా మైదానంలో ఈనెల 18వ తేదీన జిల్లాస్థాయి మహిళా హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి పి.సువర్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికయిన క్రీడాకారులు నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డి పాలెంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి మహిళా హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు.

స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన జేసీ డాక్టర్ బి.నవ్య, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, సీపీఓ ప్రభాకర్

కర్నూలు(సెంట్రల్): విజయవాడలోని ఇందిరా గాంధీ స్టేడియంలో సీఎం చంద్రబాబునాయుడు స్వర్ణాంధ్ర -2047 విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జేసీ డాక్టర్ బి.నవ్య, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, సీపీఓ ప్రభాకర్ వీక్షించారు. కాగా, అక్కడ విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించే వరకు ఇక్కడ అధికారులు వేచి ఉండాల్సి వచ్చింది.

నేడు సాహితీ స్మారకోపన్యాసం

కర్నూలు కల్చరల్: సాహితీ సదస్సు తెలుగు భాషా వికాస ఉద్యమం ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటలకు మద్దూరునగర్ పింగళి సూరన తెలుగు తోటలో పండుగ సుబ్బారెడ్డి స్మారకోపన్యాసం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు డాక్టర్ దండెబోయిన పార్వతీ దేవి తెలిపారు. 'సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య సేవ' అనే అంశంపై కవి రాజ హంస డాక్టర్ తొగట సురేష్ బాబు ప్రసంగిస్తారని పేర్కొన్నారు. గాడిచర్ల ఫౌండేషన్, సాహితీ సదస్సు అధ్యక్షుడు కురాడి చంద్రశేఖర కల్కూర, క్లస్టర్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్, తెలుగు భాషా వికాస ఉద్యమం, సాహితీ సదస్సు కార్యదర్శి జేఎస్‌ఆర్కే శర్మ అతిథులుగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతలు డోన్ జడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయులు డాక్టర్ తొగట సురేష్ బాబు, కేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల హోమ్‌సైన్స్ విభాగాధిపతి డాక్టర్ ఆరతి చక్ర, సిల్వర్ జూబ్లీ కళాశాల బాటనీ అధ్యాపకురాలు డాక్టర్ స్వప్నశ్రీలకు సన్మానం ఉంటుందని తెలిపారు

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు న్యూసిటీ: విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం నగరంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ శేషాద్రి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని సెంట్రల్, బీ రోడ్, సంతోష్ నగర్, ఓల్డ్ టౌన్ సెక్షన్ల పరిధిలోని కాలనీలు నగరాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రజా పోరాటాల కోసం విరాళాలు ఇవ్వండి

కర్నూలు(సెంట్రల్): నిత్యం ప్రజా పోరాటాలు చేస్తున్న భారత కమ్యూనిస్టు పార్టీకి బాసటగా నిలిచేందుకు విరివిగా విరాళాలు ఇవ్వాలని ఆ పార్టీ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి కోరారు. శుక్రవారం ధర్మపేటలో సీపీఐ ఆధ్వర్యంలో ఇంటింటా విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూరు సంవత్సరాలుగా సీపీఐ బడుగు, బలహీన వర్గాల కోసం పనిచేస్తోందన్నారు. ప్రజల నుంచి విరాళాలు సేకరించి ప్రజల కష్టాలను తీర్చేందుకు పోరాటాలు చేస్తున్నట్లు చెప్పారు.

సమాజంలో స్త్రీ, పురుషుడు సమానమే



ప్రసంగిస్తున్న క్లస్టర్ వర్సిటీ వీసీ ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్

కర్నూలు (సిటీ): సమాజంలో స్త్రీ, పురుషుడు ఇద్దరూ సమానమేనని, వారు బండికి రెండు చక్రల్లాంటి వారని క్లస్టర్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్ పేర్కొన్నారు. క్లస్టర్ విశ్వవిద్యాలయంలో మహిళా సాధికారత శాఖ ఆధ్వర్యంలో లైంగిక వేధింపుల నివారణపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వీసీ హాజరై మాట్లాడారు. నేటి సమాజంలో స్త్రీలపై జరిగే దాడులు చూస్తుంటే అభివృద్ధిలో ఉన్నామా? అంధకారంలో ఉన్నామా? అనే భావన మనసును తొలచివేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రముఖ న్యాయవాది తేజవతి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన ఉండాలని, అలా ఉన్నప్పుడే మనకు జరిగే అన్యాయాన్ని ఎదిరిస్తామన్నారు. సిల్వర్‌జూబ్లీ కాలేజీ ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ మహిళల మీద మంచి అభిప్రాయం ఉండాలన్నారు. మహిళా సాధికారత సమన్వయకర్త అక్తర్‌భాను మాట్లాడుతూ తప్పు జరిగినప్పుడు శిక్ష వెంటనే అమలు చేయాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ రెడ్డి ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. మహిళ ఆనందంగా ఉన్నప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. పార్వతి వందన సమర్పణ చేశారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుక్కల బెడద నియంత్రణకు చర్యలు



గార్గేయపురంలోని కుక్కల సంతాన నియంత్రణ ఆపరేషన్ కేంద్రాన్ని పరిశీలించిన కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): నగరంలో వీధి కుక్కల బెడద నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు అన్నారు. నగర శివారులోని గార్గేయపురం డంప్ యార్డులో శుక్రవారం వీధికుక్కల సంతాన నియంత్రణ ఆపరేషన్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో వీధి కుక్కల సమస్యపై ప్రజా ప్రతినిధులు, ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. వాటన్నింటినీ పరిగణలోకి తీసుకొని సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలను వేగవంతం చేసినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు డంప్ యార్డులో ఉన్న కుక్కల సంతాన నియంత్రణ కేంద్రంలో ప్రతి రోజు 20 శునకాలకు ఆపరేషన్లు చేస్తున్నామన్నారు. ఇప్పటికే యానిమల్ వెల్ఫేర్ బోర్డు ఆఫ్ ఇండియా మార్గదర్శకాలు పాటించామని, అక్కడి నుంచి త్వరలో అనుమతులు వస్తాయన్నారు. వెటర్నరీ వైద్యులు మల్లన్న, డీఈఈ గంగాధర్ పాల్గొన్నారు.

వైభవంగా 'కేలి కొట్టు' వేడుకలు



అయ్యప్ప స్వామి రథోత్సవం నిర్వహిస్తున్న దీక్షా పరులు

కర్నూలు కల్చరల్: అయ్యప్ప దీప మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేడుకల్లో భాగంగా కర్నూలు నగరంలోని మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో శుక్రవారం వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి. సప్తగిరి మణికంఠ అయ్యప్ప స్వామి దేవాలయం నుంచి మున్సిపల్ పాఠశాల మైదానం వరకు అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహంతో రథోత్సవం జరిగింది. కేలి కొట్టు, అయ్యప్ప ప్రతిష్ట పూజ, దీపారాధన, సింగారి మేళం కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం ఉదయం మహా గణపతి హోమం, అయ్యప్ప పునఃప్రతిష్ట, దీపారాధన, లక్ష శరణుఘోష అర్చన, సాయంత్రం రథోత్సవం, దీపారాధన, అయ్యప్పన్ విళక్కు, అగ్ని ప్రవేశం, మంగళహారతి తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న పి.శ్రావణి

కర్నూలు(సెంట్రల్): నందికొట్కూరు పట్టణంలోని బైరెడ్డి నగర్‌లో విద్యార్థిని లహరి మృతికి కారణమైన నిందితుడు రాఘవేంద్రను కఠినంగా శిక్షించాలని ఏపీ మహిళ సమైక్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గిడ్డమ్మ, శ్రావణి, నగర కార్యదర్శి భారతి డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. శుక్రవారం సీఆర్ భవన్‌లో ఏపీ మహిళా సమైక్య సమావేశం నగర అధ్యక్షురాలు నాగేంద్రమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లహరి మృతిపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలన్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించేందుకు అన్ని రకాల సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలన్నారు. గతంలో నందికొట్కూరు మండలం ముచ్చుమర్రిలో ఓ బాలిక హత్య మిస్టరీ వీడకుండానే.. మరోసారి నందికొట్కూరు పట్టణంలో బాలిక మృతి చెందడం దారుణమన్నారు. బాధితి కుటుంబానికి రూ.50 లక్షలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకురాళ్లు పావని, రేణుక, మునెమ్మ, ఆశాబేగం, సోషియా పాల్గొన్నారు.

మాదిగలూ.. మరోసారి మోసపోవద్దు

- 15న గుంటూరుకు కదలిరావాలి

కర్నూలు(అర్బన్): చంద్రబాబు మాయలో పడి గతంలో అవమానాలకు గురైన మాదిగలు దేశ ప్రధాని నరేంద్రమోదీ మోసపూరిత రాజకీయ కుతంత్రాల్లో పడి మరోసారి మోసపోవద్దని పీవీ రావు మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కే.మాధవస్వామి సూచించారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజా ప్రతినిధులు అన్ని కులాలు, మతాలకు సమన్యాయం చేయాలే గానీ, ఒక కులానికి మద్దతు ఇవ్వడం సరికాదన్నారు. దేశ ప్రధాని ఒక కులానికి మద్దతు ఇవ్వడం, మాదిగల సభకు హాజరు కావడం దేశ చరిత్రలో లేదని వివరించారు. వర్గీకరణకు ప్రధాని మద్దతు ఇవ్వడం వల్ల దేశంలోని మాలలను దూరం చేసుకోవడం కాదా ? అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలో ఉండాలంటే వర్గీకరణ వద్దని ప్రకటించి, మాలలకు అండగా నిలవాలన్నారు. కులాల మధ్య చిచ్చు పెట్టడం పాలకులకు తగదన్నారు. ఈ నేపథ్యంలోనే షెడ్యూల్డు కులాల వర్గీకరణకు వ్యతిరేకంగా హలో మాల – చలో గుంటూరు కార్యక్రమంలో భాగంగా ఈ నెల 15వ తేదీన నిర్వహిస్తున్న నల్లపాడు మాలల మహా గర్జన సభకు పెద్ద సంఖ్యలో కదలిరావాలని పిలుపునిచ్చారు.

బేస్‌బాల్ పోటీల్లో రాణించాలి



క్రీడా దుస్తులు పంపిణీ చేసిన ఎస్‌జీఎఫ్ జిల్లా అధ్యక్షుడు హర్షవర్ధన్

కర్నూలు (టౌన్): ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో నిర్వహించనున్న స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో రాణించాలని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి హర్షవర్ధన్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో రాష్ట్ర పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు మంచి ప్రతిభ చాటితే రాష్ట్రస్థాయిలో గుర్తింపు వస్తుందన్నారు. బేస్‌బాల్ సంఘం అధ్యక్షుడు పరమేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

ఐసీడీఎస్ పథకాల అమలులో సీడీపీఓల కీలక పాత్ర



మాట్లాడుతున్న పీడీ వెంకటలక్ష్మమ్మ

కర్నూలు న్యూసిటీ: మాతా శిశు సంక్షేమ శాఖ పథకాల అమలులో సీడీపీఓలదే కీలక బాధ్యత అని నేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ పబ్లిక్ కో–ఆపరేషన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ పుష్పలత, ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మమ్మ తెలిపారు. శుక్రవారం నగరంలోని ఐసీడీఎస్ మహిళా ప్రాంగణంలో బెంగుళూరు సెంటర్ ఆధ్వర్యంలో పోషణ బి, పడాయి బి కార్యక్రమంపై సీడీపీఓలకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ..0–3 సంవత్సరాల పిల్లలకు నవచేతన మాడ్యూల్ ద్వారా విద్యను బోధించాలన్నారు. 3–6 సంవత్సరాల పిల్లలకు ఆధార్ శిల మాడ్యూల్ ఈసీసీఈ ద్వారా బుద్ధి కుశలత, ఎమోషనల్‌పై శిక్షణ ఇవ్వాలని సూచించారు. 6 సంవత్సరాలలోపు పిల్లలకు అసెస్మెంట్ ఇవ్వడం ద్వారా పిల్లలు ఏస్థాయిలో ఉన్నారో తెలుస్తుందని అన్నారు. పోషక విలువలున్న ఆహారం అందిస్తేనే పిల్లలకు చదువుకోవడానికి సరైన ఏకాగ్రత, చురుకుదనం ఉంటుందని తెలిపారు.

విజేతలుగా తిరిగి రండి



క్రీడా దుస్తులు పంపిణీ చేసిన ఏసుదాసు

కర్నూలు (టౌన్): ఈనెల 14, 15 తేదీల్లో అనంతపురం పట్టణంలో నిర్వహించనున్న 7వ రాష్ట్రస్థాయి సీనియర్ మహిళా షూటింగ్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటి విజేతలుగా తిరిగిరావాలని గుడ్ షప్పర్డ్ స్కూల్ కరస్పాండెంట్ ఏసుదాసు అన్నారు. శుక్రవారం స్థానిక పాఠశాల క్రీడా ప్రాంగణంలో రాష్ట్ర పోటీల్లో పాల్గొనే జట్టుకు క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. రాష్ట్ర పోటీల్లో పాల్గొనే క్రీడాకారులను ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరశురాముడు ప్రకటించారు. గీతాంజలి, ప్రియాంక, స్వాతి, ప్రవల్లిక, భూమిక, పూజిత, సాయి వర్ధిని,లక్ష్మీ భవానీ, మేఘనా, జ్యోతి ప్రియా, గీతా, మమత ఉన్నారు.

గుమ్మజ్ దర్గాలో ఉరుసు



బాబాకు గులాఫ్, పూలు సమర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి

కర్నూలు (టౌన్): స్థానిక పాతబస్తీ ఉస్మానియా కళాశాల సమీపంలో ఉన్న కరీముల్లా షా ఖాద్రీ బాబా దర్గాలో శుక్రవారం రాత్రి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి ఉరుసు కార్యక్రమంలో పాల్గొన్నారు. దర్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గాలో ఆయన గులాఫ్, పూలు సమర్పించారు. స్థానిక కార్పొరేటర్ షేక్ యూనస్ బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు షరీఫ్, రియాజ్, అలీఖాన్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా?

- సాక్షి మీడియా ప్రతినిధులపై దాడిని ఖండిస్తున్నాం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి వెల్లడి



కర్నూలు (టౌన్): నిన్నటివరకు వైఎస్సార్‌సీపీ నాయకులు, సానుభూతిపరులు, సోషల్ మీడియా వ్యక్తులపై దాడులు, అరెస్టులకు పాల్పడిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు 'సాక్షి' మీడియా ప్రతినిధులపై దాడులకు పాల్పడటం చూస్తుంటే.. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా? అనిపిస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం వైఎస్సార్ జిల్లా, వేముల ఎంఆర్‌ఓ కార్యాలయం వద్ద సాగునీటి సంఘాల ఎన్నికల కవరేజీకి వెళ్లిన సాక్షి రిపోర్టర్ శ్రీనివాస్, కెమెరామెన్ రాము, రాజారెడ్డిపై టీడీపీ గూండాలు దాడులకు పాల్పడ్డారు. ఈ ఘటనపై ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. కూటమి పాలనలో రాష్ట్రంలో ఎమర్జెన్సీ రోజులు గుర్తుకు వస్తున్నాయన్నారు. నాయకులను, చివరికి మీడియా వారిని కూడా అప్పట్లో జైళ్లలో వేశారని, దీంతో ప్రజాగ్రహానికి గురికాక తప్పలేదన్నారు. కూటమి పాలనలో మహిళలపై దాడులు నిత్యకృత్యమయ్యాయని, డీజీపీ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పోలీసులు లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని, వారి కళ్లెదుటే విలేకరులపై దాడులు చేస్తున్నా అడ్డుకోలేకపోయారన్నారు. సాగునీటి సంఘాల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులను భయభ్రాంతులకు గురిచేయడమే సీఎం చంద్రబాబు లక్ష్యంగా పెట్టుకున్నారని విమర్శించారు. అన్యాయంగా దాడులు చేసుకుంటూ పోతే ప్రజలు తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. సూపర్ సిక్స్ హామీలను గాలికి వదిలేసిన కూటమి ప్రభుత్వం, ప్రశ్నిస్తే దాడులకు పాల్పడుతోందని ఇది మంచి పద్ధతి కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పద్ధతి మార్చుకోవాలని లేకుంటే ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో హనుమద్ వ్రతం





సూర్యనారాయణ స్వామి ఆలయంలో కార్యసిద్ధి హనుమ, పూజల్లో భక్తులు

కర్నూలు కల్చరల్: నగర శివారులోని సూర్యనారాయణ స్వామి ఆలయం ఆవరణ, ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో శుక్రవారం హనుమద్ వ్రతం నిర్వ హించారు. కార్యసిద్ధి ఆంజనేయ స్వామికి పంచామృతాభిషేకం, విశేష అర్చనలు, ఆకుపూజ, నవగ్రహ, హనుమత్ మూల మంత్రహోమాలు, మాన్యు సూక్త హోమాలను పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

దోమల వ్యాప్తి ద్వారా వ్యాధులు

కర్నూలు(హాస్పిటల్): దోమల ద్వారా ప్రాణాంతక వ్యాధులు వ్యాపిస్తాయని బండిమెట్ట పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ముషాహిద్ చెప్పారు. శుక్రవారం మంగళగేరిలో నిర్వహిస్తున్న ఫ్రైడే – డ్రైడే కార్యక్రమంలో మాస్ మీడియా అధికారి శ్రీనివాసులుతో కలిసి ఆయన వీధుల్లో పరిస్థితిని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఇళ్ల వద్ద తొట్లలో నిల్వ ఉన్న నీటిలో లార్వా ఉండటాన్ని పరిశీలించారు. ఏడిస్ దోమలు ఇంట్లోనూ, పరిసరాల్లో ఉండే పాత వస్తువులు, పూలకుండీలు, కూలర్లు, టైర్లు, తాగి పాడేసిన కొబ్బరి బొండాలు, రుబ్బు రోళ్లలో నిల్వ ఉన్న నీటిలో పెరుగుతాయని, తద్వారా డెంగీ, చికున్‌గున్యా వ్యాధులు వ్యాప్తి చేస్తాయని తెలిపారు. ఆరోగ్య విద్యాబోధకురాలు పద్మావతి, గీత, సచివాలయ ఆరోగ్య కార్యకర్తలు లక్ష్మి, ఆశా కార్యకర్త, ప్రాజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.



